## క్లుప్తంగా

### నారుమడుల్లో నీరు లేకుండా చూడాలి



నవుడూరు గరువులో నీట మునిగిన నారు మడులను పరిశీలిస్తున్న ఏఓ రహీమ్

మొగల్తూరు: భారీ వర్షాలకు నారుమడుల్లో చేరిన నీటిని బయటకు తీసేయాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీమ్ రైతులకు సూచించారు. గురువారం ఆయన మొగల్తూరు మండలం శేరేపాలెం పంచాయతీ నవుడూరు గరువు, రామన్నపాలెం గ్రామంలో పర్యటించారు. నీటమునిగిన నారుమడులను పరిశీలించారు. నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నత్రజని లాంటి ఎరువులు వాడొద్దన్నారు. మండలంలో సుమారు 1198 ఎకరాల్లో సార్వా చేపట్టగా ఇప్పటి వరకు 79 ఎకరాల్లో నారుమడులు, 165 ఎకరాల్లో నాట్లు వేశారని చెప్పారు. గడిచిన 24 గంటల్లో మొగల్తూరు మండలంలో 23.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

### ఆర్ఎంపీ అసోసియేషన్ మండల కార్యవర్గ ఎన్నిక



పెనుమంట్ర ఆర్ఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

పెనుమంట్ర: పారా మెడికల్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఆర్ఎంపీ) అసోసియేషన్ పెనుమంట్ర మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు గురువారం స్థానిక శ్రీసాయినాథ కల్యాణ మండపంలో అసోసియేషన్ మండల సమావేశం జిల్లా కన్వీనర్ ఏఆర్‌కే పరమేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా పట్నాల గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జి.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా వి.చంద్రరావు, సహాయ కార్యదర్శిగా ఎస్‌కేఎస్ ఆలీజిన్నా, కోశాధికారిగా పాలా వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా, సభ్యులుగా టీబీ శ్రీనివాస్, వి.సతీష్, కె.దానియేలు, ఎం.తిరుపతిరావు, కె.శ్రీనివాస్, పి.సాయికృష్ణ, ఎస్ ఉమామహేశ్వరరావు, కె.ఆదినారాయణలను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీకే రాజు, వేమూరి మహేష్, ఎస్ జయసూర్య, ఎం.జయరాం, తేతలి సాయిబాబారెడ్డి పాల్గొన్నారు.

### రేపు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

నరసాపురం రూరల్: నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లోని వివిధ కళాశాలల్లో జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్టు మాస్టర్ మైండ్స్ అడ్వైజర్ మోహన్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నరసాపురం పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతి కూడా అందజేస్తామని పేర్కొన్నారు. ఎంపీసీలో 430, బైపీసీలో 400, ఎంఈసీలో 470, సీఈసీలో 450కు పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని, తమ ఆధార్, కళాశాల గుర్తింపు కార్డులతో పాటు మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ)లను తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు తమ పేర్లను సెల్ నెంబర్లు 89784 80385, 85558 30687లో నమోదు చేసుకోవాలని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్వైజర్ మోహన్ తెలిపారు.

### కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తాను పనిచేస్తున్న రెస్టారెంట్ వద్దకు వచ్చి మహిళ అసభ్యంగా మాట్లాడుతూ కులం పేరుతో దూషించారంటూ నరసయ్య అగ్రహారం చెందిన ముప్పిడి శిరోమణి వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం డిపో వద్ద ఉన్న అన్నపూర్ణ రెస్టారెంట్లో శిరోమణి పనిచేస్తోందని, అయితే యర్రంశెట్టి మహేశ్వరి అనే మహిళ గురువారం రెస్టారెంట్ వద్దకు వచ్చి అక్కడ ఉన్న వంటలు కూరలు పాడుచేసి తనని దూషించారని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### గుర్రపుడెక్క తొలగింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని తాడేరు, శ్రీరామపురం, వెంప, దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామాల మీదుగా వెళ్లే గునుపూడి సౌత్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, కిక్కిస, తూడును పొక్లెయిన్‌తో డ్రెయినేజీ శాఖ అధికారులు తొలగిస్తున్నారు. ఈ డ్రెయిన్ ఆనుకుని సుమారు 12 వేల ఎకరాల్లో వరి సాగు, చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. వర్షాకాలం కావడం, భారీ వర్షాలు కురవడంతో గుర్రపుడెక్క, కిక్కిస, తూడు పేరుకుపోవడంతో వరదనీరు ఎక్కడికక్కడ నిలిచి వరి చేలు మునిగిపోతుండటంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశాలతో వరద నీరు దిగువకు పారేందుకు అధికారులు కిక్కిస, గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆహ్లాదభరిత పర్యాటకం.. సముద్ర తీరం



వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన చీఫ్‌విప్ ప్రసాదరాజు (ఫైల్)



పేరుపాలెం బీచ్‌లో టూరిజం శాఖ నిర్వహిస్తున్న హంస రిసార్ట్స్



వైఎస్ విగ్రహం ఏర్పాటుచేస్తున్న ప్రాంతం

- వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లలో ముమ్మరంగా సౌకర్యాల కల్పన
- సెలవు రోజుల్లో పర్యాటకుల సందడి

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో 19 కిలో మీటర్ల సముద్ర తీరప్రాంతం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో ఇక్కడున్న పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లలో సేదతీరడానికి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. సెలవు రోజుల్లో సందడి నెలకొంటుంది. జిల్లాలోనే ఏకైక బీచ్‌లైన పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లకు 2020 బీచ్ ఫెస్టివల్ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లుగా నామకరణం చేశారు. ఈ బీచ్‌లకు పర్యాటకుల తాకిడి పెరగడంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సంకల్పించారు.

**రూ.కోటితో వైఎస్ విగ్రహం**

కేపీపాలెం బీచ్‌లో రూ.కోటితో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఈ ఏడాది మే 11న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. వైఎస్ విగ్రహంతోపాటు ఆయన జీవిత విశేషాలను తెలియజేసేలా మ్యూజియం, సందర్శకులు కూర్చునేలా పచ్చని లాంజ్ ఏర్పాటు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

**రూ.20 లక్షలతో బీచ్‌లో సౌకర్యాలు**

పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లకు ఆదివారం సందర్శకులు భారీగా తరలివస్తుంటారు. కార్తీకమాసం నెలరోజుల్లో ప్రతి ఆది, బుధవారాల్లో వేలాది మంది పర్యటకులు సముద్ర స్నానం చేసి తీరంలోని సరుగుడు తోటలో వనభోజనాలు చేస్తారు. ఈ నేపథ్యంలో పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో పర్యటకులు సేదతీరడానికి షెడ్లు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు వంటివి కల్పించేందుకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**రహదారుల అభివృద్ధి**

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీచ్‌లకు వచ్చే పర్యాటకులకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇటీవల రూ.4.30 కోట్లతో నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామం నుంచి వేములదీవి, చినమైనవాని లంక, పీఎంలంక మీదుగా వయా కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లను కలుపుతూ సముద్రం శివారు ఏటిమొగ వరకు సుమారు 12 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముత్యాలపల్లి, మోడి మీదుగా పేరుపాలెం బీచ్ వరకు, సీతారాంపురం, కేపీపాలెం మీదుగా పేరుపాలెం సెంటర్ వరకు రోడ్ల నిర్మాణానికి రూ.28 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. తీరప్రాంత గ్రామాల నుంచి బీచ్‌కు వచ్చే అన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**యువ టూరిజమ్ క్లబ్‌లు**

జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టత, టెంపుల్ టూరిజమ్, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఎంపిక చేసిన కాలేజీల్లో యువ టూరిజమ్ క్లబ్‌ల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ కృషి చేస్తున్నారు. ఈ క్లబ్‌ల ద్వారా 25 నుంచి 30 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి అవగాహన కల్పిస్తారు.

### బీచ్‌ల అభివృద్ధికి చర్యలు



వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసిన కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. బీచ్‌లలో మౌలిక వసుతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. బీచ్‌లకు వచ్చే పర్యాటకుల కోసం రూ.కోట్లు వెచ్చించి రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తున్నారు.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్‌విప్, ఎమ్మెల్యే, నరసాపురం

### నేడు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి షెడ్యూల్

నరసాపురం/మొగల్తూరు: ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మొగల్తూరు మండలం పాతపాడు, 11 గంటలకు కేపీపాలెం సచివాలయాల వద్ద నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు నరసాపురం మండలం దర్బరేవు, 4 గంటలకు నరసాపురం పట్టణంలోని 18, 19 వార్డులకు సంబంధించి మృత్యుంజయ నగర్ వద్ద జరిగే సభల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

### సరిపల్లిలో రక్త నిర్ధారణ పరీక్షలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సరిపల్లి సబ్‌సెంటర్ వద్ద గురువారం పలువురికి రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి, చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ సోని, కౌన్సిలర్ పి.సురేష్‌బాబు సిబ్బంది హనుమంతు, కె.ఉమాదేవి, అడ్డాల నర్సింహారావు, ఏఎన్ఎం పి.జయంతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల నిరసన

నరసాపురం రూరల్: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా నరసాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ జి.శ్రీకాంత్, జేఏసీ కన్వీనర్ ఘంటశాల వెంకటేశ్వరరావు, పి.ఓంకారం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

# జగనన్న సురక్షలో నరసాపురానికి రెండో స్థానం



సారవ సచివాలయం వద్ద లబ్ధిదారులకు ధ్రువ పత్రం అందిస్తున్న చీఫ్‌విప్



కట్టుపాలెంలో సర్టిఫికెట్స్ అందజేస్తున్న కవురు శ్రీనివాస్

చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లాలో నరసాపురం మండలం ద్వితీయ స్థానంలో ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. గురువారం నరసాపురం మండలం సారవ, ఎల్బీచర్ల గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం హయాంలో సారవ గ్రామంలో రూ.6.50 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.19 కోట్లు జమ చేశామని చెప్పారు. గ్రామంలో శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి ప్రభుత్వమే స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామస్తులకు ఇస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సారవలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.28 లక్షలు కేటాయించామని, దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.20 కోట్లతో లక్ష్మణేశ్వరం వయా ఎల్బీచర్ల మీదుగా పెదమైనవానిలంక వరకు సుందరంగా సీసీ రహదారి నిర్మాణానికి పనులు ప్రారంభించామని చెప్పారు. నరసాపురం నియోజకవర్గంలో సుమారు 73 వేల కుంటుంబాలు ఉండగా ఇప్పటి వరకూ సుమారు 68 వేల సర్టిఫికెట్లు అర్హులకు అందజేశామని వివరించారు. రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ పేద కుటుంబాలకు విద్య, వైద్యం భారం కాకుండా విప్లవాత్మక సంస్కరణలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోమన్‌రెడ్డిదేనన్నారు. ఈ సందర్భంగా అర్హులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ కడలి లక్ష్మీదుర్గ, సర్పంచ్‌లు కైల లావణ్య, వేగేశ్న సీతారామరాజు, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావు, మండల స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి, తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, కడలి రాంబాబు, మైలాబత్తుల శ్రీను, చినిమిల్లి చంద్రశేఖర్, బొడ్డు ఆశీష్‌కుమార్, సంగాని బాబూరావు, గుబ్బల భాను, కంచర్ల రామకృష్ణ, మందపాటి ఏసుబాబు, కడలి అబద్ధం, అయినంపూడి బాపిరాజు, కంకటాల పెద్దిరాజు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**పాలనల్లో వ్యత్యాసం గమనించండి**

యలమంచిలి: గత ప్రభుత్వాల పాలనకు జగనన్న ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ప్రజలను కోరారు. కట్టుపాలెం గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏదైనా సాంకేతిక సమస్యతో పథకాల లబ్ధి చేకూరకపోతే వారికి కూడా న్యాయం చేయాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మహిళలకు, విద్యార్థులకు, రైతులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ పొన్నమండ నాగరాజు సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొన్నమండ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు చిలుకూరి సుబ్బారావు చౌదరి, గటిగంటి మహేష్ పార్టీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, పొన్నమండ ఏడుకొండలు, జానకి, పొన్నమండ ముత్యాలరావు, కొల్లాటి నాగరాజు, మోకా ప్రేమ్‌చంద్, మంద హరికుమార్, పెచ్చెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి



కొడమంచిలిలో కంద విత్తనాలను అందిస్తున్న అధికారులు, నాయకులు

పెనుగొండ: రైతులకు అండగా నిర్వహిస్తోన్న పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొడమంచిలి సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ అన్నారు. గురువారం కొడమంచిలిలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు మెరుగైన దిగుబడులు సాధించడానికి అవలంబించాల్సిన పద్ధతులపై పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పించారు. రైతులకు కంద విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, నెక్కంటి రామకృష్ణ, మన్నే బాబు, చల్లాబత్తుల కాంతారావు, దేవబత్తుల జయరాజు, గుండే శేఖర్, నేలపూడి వెంకటేశ్వరరావు, నవీన్, శ్రీదేవి పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం



సీతారామపురంసౌత్‌లో ఆయిల్‌పామ్ మొక్క నాటిన అధికారులు

నరసాపురం రూరల్: ఆయిల్‌పామ్ సాగుకు నరసాపురం తీర ప్రాంత నేలలు అనుకూలమని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామంలో గురువారం మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన ఉద్యాన రైతు జంపన జగన్నాథరాజు, సుబ్బరాజులకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమన్నారు. పామాయిల్ పంటకు అధిక డిమాండ్ ఉందని, రాయితీలతో కూడిన ఈ సాగుకు ఆసక్తి కనబర్చే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలుగా కోకో, కూరగాయల సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్‌పామ్ సాగు ప్రారంభించిన మొదటి నాలుగు సంవత్సరాలు హెక్టారుకు రూ.5 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ, మొక్కల సంరక్షణకు హెక్టారుకు ఏడాదికి రూ.5 వేలు చొప్పున కూడా నాలుగేళ్ల ప్రోత్సాహాన్ని ఇస్తుందని వివరించారు. త్రీఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పి.విజయప్రసాద్ మాట్లాడుతూ అధిక లాభాలను ఆర్జించి పెట్టే ఆయిల్ పామ్ సాగుకు రైతులంతా పెద్ద ఎత్తున ముందుకు రావాలని, ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ప్రియదర్శిని, ఉద్యానశాఖ సహాయకుడు కేదారి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సురేష్, రాజగోపాల్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# చురుగ్గా ఓటర్ల జాబితా తనిఖీ



వడలిలో ఓటర్ల తనిఖీని పర్యవేక్షిస్తున్న తహసీల్దారు గురుమూర్తి రెడ్డి



నెగ్గిపూడి 115 పోలింగ్ బూత్ ఏరియాలో ఓటర్ల వెరిఫికేషన్ చేస్తున్న బూత్ కన్వీనర్లు

పెనుగొండ: ఓటర్ల తనిఖీ పెనుగొండ మండలంలో చురుగ్గా నిర్వహిస్తున్నారు. బీఎల్‌ఓలు, బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓట్లను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గురువారం వడలిలో తహసీల్దారు ఎన్.గురుమూర్తి రెడ్డి పర్యవేక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఓటర్ల తనిఖీలు చేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

**నెగ్గిపూడిలో ఓటర్ల తనిఖీ ప్రారంభం**

పెనుమంట్ర: నెగ్గిపూడి పంచాయతీ పరిధిలో 115వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ, టీడీపీల బూత్ కన్వీనర్లతో కలిసి బీఎల్ఓ గుబ్బల గోవిందరావు గురువారం ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తివిష్ణుకుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ లక్ష్మి, సత్తి వెంకటరెడ్డి, కర్రి బ్రహ్మారెడ్డి, టీడీపీ తరపున పాలా ప్రసాద్, కడలి సుబ్రహ్మణ్యం, తోలేటి రాంబాబు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ



కాంభోట్లపాలెం విత్తనాల కిట్లతో రైతులు

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత రైతులకు రూ.10 వేలు విలువైన విత్తనాలు, వ్యవసాయ పరికరాల కిట్లు అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి అన్నారు. ఈ పథకంలో భాగంగా గురువారం కాంభోట్లపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద దళిత రైతులకు 14 రకాల విత్తనాల కిట్లను వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, సర్పంచ్ అనిశెట్టి మల్లిక చేతుల మీదుగా పంపిణీ చేశారు. త్వరలో ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు తయారీకి అవసరమైన డ్రమ్ములు, టార్పాలిన్‌లు, లింగా కర్షక బుట్టలు, జిగురు అట్టలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ, నాయకులు మంద హరికుమార్, శీలం వీరబాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు డి.మణికంఠ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.జ్యోతి, జె.లక్ష్మీనారాయణ, కె.సోని, బి.లక్ష్మీదుర్గ, రైతులు పల్లి జార్జిబాబు, అనిశెట్టి గంగాధరరావు, మంద వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### సివిల్ రైట్స్ డే

పాలకోడేరు: దళిత పేటల్లో సమస్యలు కోకొల్లలుగా ఉంటున్నాయని, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పటిష్టంగా అమలు జరపాలని, ఈ కేసుల నమోదులో జాప్యం జరగడం వల్ల బాధితులకు పరిహారం సకాలంలో అందడం లేదని జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం పాలకోడేరులో జరిగిన సివిల్ రైట్స్‌డేలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ మరియమ్మ అధ్యక్షత వహించారు.



# ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులు



డీఎన్నార్‌లో కలాంకు నివాళులర్పిస్తున్న దృశ్యం



ముత్యాలపల్లి హైస్కూల్లో నివాళులర్పిస్తున్న దృశ్యం



కొడమంచిలిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం ఎనిమిదో వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. అకడమిక్ ఇన్‌స్పెక్షన్‌కు విచ్చేసిన ఆర్‌జేడీ సి.కృష్ణ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేపర్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించి దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఉన్నతమైన పదవులను అధిరోహించిన కలాంను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు నోబుల్ రాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**ముత్యాలపల్లి హైస్కూల్లో..**

మొగల్తూరు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాల ఆవరణంలో కలామ్ విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని చెప్పిన కలామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు కేఎస్ఎన్ రాజు సూచించారు. కార్యక్రమంలో ఎన్ రాంబాబు, స్పందన, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

**కలాం గొప్ప సంఘ సంస్కర్త**

పెనుగొండ: భారత దేశానికి విశిష్ట సేవలు అందించిన మహానుభావుడు అబ్దుల్ కలాం అని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. గురువారం ఏపీజే అబ్దుల్ కలాం 8వ వర్ధంతి సందర్భంగా కొడమంచిలి పంచాయతీలో కలాం చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, కుసుమే నారాయణ మూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండేటి రమేష్, పార్టీ నాయకులు బొరుసు రాంబాబు, పోలిశెట్టి వనమరాజు, ఆకుమర్తి రాంబాబు, గుమ్మడి కమలరాజు, పుచ్చకాయల రమేష్, కోటి శశి పాల్గొన్నారు.